భారంగా వ్యవసాయం

- పెరిగిన పెట్టుబడులు
- గత ఏడాది కంటే 30 శాతం పెరిగిన పరికరాల రేట్లు
- వ్యవసాయ యంత్రాల అద్దె రెట్టింపు
- తడిసి మోపెడవుతున్న ఖర్చులు
- ఇబ్బందుల్లో అన్నదాతలు


యంత్ర సహాయంతో విత్తుతున్న రైతు

ఎల్లారెడ్డిపేట: వానకాలం పంటలు సాగు చేయడం అన్నదాతలకు తలకు మించిన భారంగా మారింది. భారీగా పెరిగిన పెట్టుబడులతో ప్రధానంగా సన్న, చిన్నకారు, మధ్యతరగతి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గత ఏడాదితో పోలిస్తే వ్యవసాయ పెట్టుబడులు రెట్టింపయ్యాయి. మరోపక్క వ్యవసాయ పనిముట్ల ధరలు 25 నుంచి 30 శాతం వరకు పెరిగింది. పెరిగిన ధరలతో వ్యవసాయం చేయలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం రైతులు పండించిన పంట కొనడం దేవుడెరుగు.. ప్రస్తుతం పెట్టుబడులు, పెరిగిన యంత్రాల అద్దెలతో ఆర్థికంగా చితికిపోతున్నారు.

పెరిగిన పెట్టుబడులు

మండల వ్యాప్తంగా ఈ విధంగా ధరలు పెరిగాయి. నారుమడి, పొలం దున్నేందుకు గతంలో రూ.5,500, ప్రస్తుతం 7,200. వరి వేయడానికి రూ.వెయ్యి ఉండగా ప్రస్తుతం రూ.1500 అయింది. నాటు వేయడం ఒక ఎకరానికి రూ.4,500 ఉండగా రూ.5,500 వరకు పెరిగింది. రూ.15 వేలు ఉన్న కేజీ వీల్స్‌కు రూ.18 వేలు కాగా కల్టివేటర్‌కు రూ.25 వేలు ఉండగా ప్రస్తుతం రూ.30 వేయిలయ్యింది. హైబ్రిడ్ వరి విత్తనాలు 20 కిలోలకు రూ.2 వేలు పెరిగింది. కలుపు మందు, కలుపు తీసేందుకు రూ.2,300, డీఏపీ, జింక్, గుళికలు, యూరియా మందుల పిచికారీకి రూ.25 వేలు, వరి కోత మిషిన్, దాని ట్రాక్టర్‌కు రూ.5,500లు, ధాన్యం ఆరబెట్టేందుకు హమాలీల చార్జీలు మరో రూ.2 వేల చొప్పున ఖర్చవుతుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం వ్యవసాయం ఎక్కువ మంది రైతులు ట్రాక్టర్ ఆధారిత పరికరాలతో చేస్తున్నారు. వీటికి విడి సామాగ్రి, విడి బోల్టులు, పాయింట్లు, పిన్నులు, కర్రలు, నాగళ్ల ధరలతో పాటు టిల్లర్, పవర్ టిల్లర్ విత్తన గొర్రు, గుంటుక, రోటివేటర్, చదును చేసే పరికరాలు, కలుపు తీసే యంత్రాల ధరలు భారీగా పెరిగాయి. నాగలి సెట్టుకు వేసే పాయింట్లు గత ఏడాది రూ.500 ఉండగా ప్రస్తుతం రూ.వెయ్యి, గొర్రు సెట్టుకు రూ.23 వేలు ఉండగా ప్రస్తుతం రూ.36 వేలు, రూ.500 ఉండే నాగలి కర్రులు రూ.వెయ్యి, రూ.42 వేలు ఉండే సిడ్ డ్రిల్ రూ.48 వేలు, రూ.85 వేలు ఉండే పవర్ వీడర్ రూ.98 వేలు, రూ.లక్ష 6 వేలు ఉండే రోటివేటర్ రూ.1.20 లక్షల చొప్పున పెరిగాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వివిధ ప్రాంతాలను అనుసరించి రేట్లు పెరిగాయి.

డీజిల్ ధరల పెంపుతో భారం

ఇనుము ధరలు పెరగడం, కూలీల కొరత, డీజిల్ ధరల పెంపుతో రవాణా చార్జీలు అధికం కావడం మూలంగా వ్యవసాయ సామగ్రి ధరలు పెరిగాయి. ఇనుము ధర గత సంవత్సరంతో పోలిస్తే టన్నుకు రూ.20 వేల వరకు పెరిగింది. ఫలితంగా ఆ భారమంతా అన్నదాతలపైనే పడుతోంది. పై వాటన్నింటి ధరలకు రెక్కలు రావడంతో వాటికి సంబంధించిన వ్యవసాయ ఆధారిత పరికరాల ధరలు ఆకాశాన్నంటాయి. మొత్తంగా దేశానికి అన్నం పెట్టే రైతన్నలు వ్యవసాయం చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా చిన్న, సన్నకారు వర్గాల రైతులకు వానకాలం సాగు చేయడం ఇబ్బందిగానే మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులకు ప్రభుత్వపరంగానే పనిముట్లను అందించి అన్నదాతలను ఆదుకోవాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

ఖర్చు పెరిగింది



వానకాలంలో విత్తనాల నుంచి మొదలుకొని పంటలు సాగు చేసే వరకు అన్ని ఖర్చులు తడిసి మోపడవుతున్నాయి. ట్రాక్టర్ ఖర్చులు, పరికరాల భారంతో అప్పులు చేయాల్సి వస్తోంది. పరికరాలపై ధరలు తగ్గించి రైతాంగాన్ని ఆదుకోవాలి. ప్రభుత్వమే అద్దె పనిముట్లను తక్కువ ధరకు అందించాలి.

– న్యాలకంటి దేవరాజు, రైతు, ఎల్లారెడ్డిపేట

అప్పులతో పంటల సాగు



రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేసుకోవాల్సి పరిస్థితులున్నాయి. అద్దె పనిముట్ల ధరలకు రెక్కాలొచ్చాయి. విత్తనాలు కొనుగోలు మొదలుకొని పంటలు చేతికి వచ్చే వరకు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ప్రభుత్వమే రైతులకు సహాయం చేయాలి.

– కొండేటి శ్రీనివాస్, నారాయణపూర్

ధరలు పెరిగింది వాస్తవమే



వ్యవసాయ రంగంలో వాడే పనిముట్ల ధరలు పెరిగింది వాస్తవమే. మార్కెట్లో పరికరాల తయారీ కోసం వినియోగించి ముడిసరుకుల ధరలు పెరగడం మూలంగానే ఈ పరిస్థితి తలెత్తింది. రైతులు సేంద్రియ ఎరువులు వాడి కొంత ఖర్చులను తగ్గించుకోవాలి. ప్రభుత్వం సబ్సిడీపై కొన్ని పరికరాలను అందిస్తోంది.

– చాద భూంరెడ్డి, వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట

ఊరూరా హరితోత్సవం


గంభీరావుపేట: నర్మాలలో మొక్కలు నాటుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు


మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కళ


సిరిసిల్లకల్చరల్: గ్రంథాలయ ప్రాంగణంలో మొక్కనాటుతున్న అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య


రుద్రంగిలో..

రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో సోమవారం హరితోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

బోయినపల్లి: మండలంలోని కోదురుపాకలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ మొక్కలు నాటారు.

గంభీరావుపేట: ఎగువమానేరు సమీపంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు.

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ నర్సరీని ప్రారంభించిన అనంతరం మొక్కలు నాటారు.

సిరిసిల్లకల్చరల్: జిల్లా గ్రంథాలయ ప్రాంగణంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య మొక్కలు నాటారు.

ముస్తాబాద్: స్థానిక బాలుర గురుకుల విద్యాలయంలో సర్పంచ్ సుమతి మొక్కలు నాటారు. పోతుగల్ మోహినికుంట, నామాపూర్, చిప్పలపల్లి, ఆవునూర్, గూడెం గ్రామాల్లో మొక్కలు నాటారు.

ఇల్లంతకుంట: మండలంలోని అనంతారం గ్రామంలో కార్యక్రమానికి జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి హాజరయ్యారు.

వేములవాడరూరల్: మండలంలోని మర్రిపల్లి గ్రామంలో ఎంపీపీ బండ మల్లేశం మొక్కలు నాటారు.

కోనరావుపేట: మండలం సుద్దాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు.


బోయినపల్లిలో హరితోత్సవంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, ఎమ్మెల్యే రవిశంకర్

తంగళ్లపల్లి: ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీపీ పడిగెల మానస మొక్కలు నాటారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో సిరిసిల్ల రూరల్ సీఐ బి.ఉపేందర్, ఎస్సై పాకాల లక్ష్మారెడ్డితో కలిసి మొక్కలు నాటారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, అధికారులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండలంలో హరితోత్సవం రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, వైస్ ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరం, సంకెపల్లి గ్రామాల్లో ఎంపీపీ బూర వజ్రమ్మ మొక్కలు నాటారు.

వీర్నపల్లి: మండలం గర్జనపల్లి, రంగంపేట, వీర్నపల్లి, కంచర్లలో ఎంపీడీవో నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిపేట: వెంకటాపూర్‌లో..


వీర్నపల్లిలో..


తంగళ్లపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద..


తంగళ్లపల్లి: పోలీస్‌స్టేషన్ ఆవరణలో..


ముస్తాబాద్: పోతుగల్‌లో..


వేములవాడరూరల్: మర్రిపల్లిలో..


వేములవాడఅర్బన్: రుద్రవరంలో..


ఇల్లంతకుంట: మొక్కలు నాటుతున్న జెడ్పీ వైస్‌చైర్మన్


కోనరావుపేట: సుద్దాలలో..

క్లుప్తంగా

మా పల్లెకు బస్సచ్చిందోచ్


బస్సుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

వేములవాడరూరల్: ఆ పల్లెకు ఆర్టీసీ బస్సు రాకపోవడంతో చాలా రోజులుగా అధికారులకు వినతిపత్రాలు ఇచ్చి మొరపెట్టుకున్నారు. ఎట్టకేలకు అధికారులు స్పందించి ఆ పల్లెకు పల్లె బస్సును పంపడంతో గ్రామస్తులందరూ స్వాగతం పలికారు. మండలంలోని నూకలమర్రి గ్రామానికి ఆ ఆర్టీసీ సేవలు లేకపోవడంతో చాలా నెలలుగా అధికారులకు విన్నవించారు. ఎట్టకేలకు సోమవారం ఆ గ్రామానికి బస్సు రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల తిరుపతి, వార్డుసభ్యులు, గ్రామస్తులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

యోగాతో అందరికీ ఆరోగ్యం


మాట్లాడుతున్న ఆడెపు రవీందర్

సిరిసిల్లటౌన్: నిత్య యోగా సాధనతో అన్ని వయస్సుల వారికి ఆరోగ్యం వృద్ధి చెందుతుందని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్ అన్నారు. రెండు రోజుల్లో 9వ అంతర్జాతీయ యోగా డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమంపై సోమవారం ప్రచారం చేపడుతూ..మాట్లాడారు. పట్టణంలోని యోగా సాధన చేసే అన్ని కేంద్రాలు, విద్యా సంస్థలను సందర్శిస్తూ..మాట్లాడారు. బుధవారం జరిగే యోగా దినోత్సవం సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి రాష్ట్రీయ, జాతీయ యోగా క్రీడాకారులతో ప్రదర్శన ఉంటుందన్నారు. ఆరోగ్య దేశం కాంక్షించే ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా అధ్యక్షుడు గుడ్ల రవి, పతంజలి యోగా సమితి నిర్వాహకుడు ఎలిగేటి కృష్ణ, జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ముక్క బియ్యంతో మధ్యాహ్న భోజనం


బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

వేములవాడరూరల్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ముక్కపట్టిన బియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని ఎంపీపీ బండ మల్లేశంయాదవ్ మండిపడ్డారు. మండలంలోని మర్రిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న బియ్యం చాలా రోజుల క్రితం ముక్కబడి ఉందని గుర్తించి, ఈ విషయంపై వెంటనే ఎంఈవో భూక్య బన్నాజీకి సమాచారం అందించారు. రేపటిలోగా నాణ్యమైన బియ్యాన్ని తెప్పించి విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించాలని సూచించారు. అనంతరం కస్తూర్బా కళాశాలకు వెళ్లిన ఆయన కళాశాల ఆవరణంలో చెత్తాచెదారంతో నిండిపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల ప్రారంభమై విద్యార్థులు అడ్మిషన్ పెరిగినా ఆవరణలో మాత్రం చెత్తా చెదారాన్ని తొలగించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే ఉపాధిహామీ సిబ్బందితో మంగళవారం కళాశాల ఆవరణ మొత్తం శుభ్రం చేయించాలని ప్రిన్సిపాల్ శకుంతలకు సూచించారు.

సమాచారం

28న ఉపాధిహామీ ప్రజావేదిక

వీర్నపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 28న ఉపాధి హామీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నరేశ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 19 నుంచి 27 వరకు సామాజిక బృందం ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రజావేదికలో అన్ని గ్రామాల సర్పంచులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నియామకం

పారా లీగల్ వలంటీర్‌గా రాజవీర్

గంభీరావుపేట: మండల కేంద్రానికి చెందిన మల్యాల రాజవీర్‌ను పారా లీగల్ వలంటీర్ (అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్స్)గా నియమిస్తూ సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ సోమవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ముస్తాబాద్ రైతు వేదికలో రాజవీర్ పనిచేయనున్నారు. రైతులకు చట్టాలపై అవగాహన కల్పించనున్నారు. రాజవీర్ నియామకం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షుడిగా మహేశ్‌యాదవ్

వేములవాడఅర్బన్: రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వేములవాడ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా మారవేణి మహేశ్ యాదవ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు బత్తుల మహేందర్ యాదవ్ సోమవారం ఉత్తర్వులను జారీ చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

గంభీరావుపేట: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. ప్రభుత్వం పాఠశాలల నిర్వహణను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి మద్యంపై ఉన్న శ్రద్ధ పాఠశాలలపై లేదని విమర్శించారు. స్కావెంజర్లు లేక పాఠశాలల్లో అపరిశుభ్రత నెలకొందన్నారు.

వైద్యుడికి స్వాగత సన్మానం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరం పల్లె దవాఖానకు కొత్తగా వచ్చిన డాక్టర్ విక్రమ్‌ను గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సోమవారం స్వాగత సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ బూర వజ్రమ్మ మాట్లాడుతూ రుద్రవరం, సంకెపల్లి, ఆరెపల్లి గ్రామాల ప్రజలు వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. సర్పంచ్ రాంరెడ్డి, ప్రవీన్, బాబు, పాల్గొన్నారు.

రామాలయ అభివృద్ధికి కృషి

గంభీరావుపేట: మండల కేంద్రంలోని పురాతన దేవాలయమైన శ్రీసీతారామస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. ఆలయాన్ని సోమవారం సందర్శించారు. ఆలయ అభివృద్ధికి తయారు చేసిన ప్రతిపాదనలను మంత్రి కేటీఆర్ అందించి, తద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మల్లుగారి నర్సాగౌడ్, సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు ఉన్నారు.

హాస్టల్ భవనాలు నిర్మించాలి

బోయినపల్లి: ప్రతి జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు విద్యార్థులకు హాస్టల్ భవనాలు నిర్మాణానికి ఒక ఎకరం స్థలాన్ని కేటాయించి, రూ.2 కోట్లు కేటాయించాలని మున్నూరు కాపు సంఘం నాయకులు తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో మున్నూరు కాపులు 40 లక్షల మందిపైగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, రాంబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి

- ఇల్లు కట్టుకునే వారికి రూ.3 లక్షల సాయం
- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

కోనరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలో బైపాస్ రోడ్డులో వంతెన, పల్లె దవాఖానా భవనం, ఆర్వో ప్లాంట్, కళాశాల ఆవరణలో జిమ్ నిర్మాణ పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇప్పటి వరకు 200 వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చుతున్నామన్నారు. ఇల్లు కట్టుకునే వారికి రూ.3 లక్షల సాయం అందించే గృహలక్ష్మి పథకానికి సీఎం కేసీఆర్ జూలై 1న ప్రారంభిస్తారని అన్నారు. దళిత బంధు పథకానికి ఇప్పటి వరకు 100 యూనిట్లు వచ్చాయని, మరో 1100 యూనిట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. అప్పుడు గ్రామానికి 15–20 యూనిట్లు వస్తాయన్నారు. అలాగే బీసీ బంధు పథకం రాబోతున్నదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్ రావు, వైస్‌ఎంపీపీ సుమలత, సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, సర్పంచ్ రేఖ, ఉపసర్పంచ్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ డుమ్మా..

ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యేతో కొంతకాలంగా దూరంగా ఉంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ తన సొంత మండలంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం చర్చనీయాంశంగా మారింది. అలాగే వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు, కొలనూర్, కోనరావుపేట సింగిల్‌విండో చైర్మన్లు సంకినేని రాంమోహన్‌రావు, బండ నర్సయ్య హాజరుకాలేదు. కాని ఇటీవల చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజ్ చైర్మన్ లక్ష్మీనర్సింహరావు వేములవాడలో తన కార్యాలయాన్ని ప్రారంభించగా వీరు హాజరై మద్దతు తెలిపారు. దీంతో వివిధ రకాలుగా చర్చించుకుంటున్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్/వేములవాడ/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/కోనరావుపేట/గంభీరావుపేట/చందుర్తి/తంగళ్లపల్లి/వీర్నపల్లి: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేములవాడ రాజన్న గుడి ఎదుట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కేక్ కట్ చేసి, భక్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో పీసీసీ నాయకుడు నాగుల సత్యనారాయణగౌడ్, పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు, వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామునివనిత, మండల అధ్యక్షులు దొమ్మటి నర్సయ్య, బాల్‌రెడ్డి, షేక్ ఫిరోజ్‌పాషా, హమీద్, ప్రవీణ్ (టోని), బూత శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఎల్లయ్య, సిరిసిల్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం


ఆలయం వద్ద తండావాసుల సంబరాలు

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం మద్దిమల్లతండాలో సేవాలాల్, జగదాంబ ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో సేవాలాల్ మహారాజ్, జగదాంబ విగ్రహాలను ఊరేగించారు. బంజారా మహిళలు చేసిన సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జవహర్‌లాల్, ఎంపీపీ భూల, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

హెల్త్ సర్వే ప్రారంభం

రుద్రంగి: కరీంనగర్ చెల్మెడ ఆనందరావు జనరల్ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో మండలంలో నిర్వహించే హెల్త్ సర్వే సోమవారం ప్రారంభమైంది. ఆస్పత్రి వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికి వెళుతూ గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుకొని నోట్ చేసుకుంటున్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీసీ సాయం కొరకు దరఖాస్తుల ప్రవాహం

తంగళ్లపల్లి: ప్రభుత్వం బీసీలకు రూ.లక్ష సాయం చేస్తామని ప్రకటించడంతో ప్రభుత్వ సాయం పొందేందుకు పెద్ద సంఖ్యలో బీసీ ప్రజలు పోటీ పడుతున్నారు. కుప్పలు తెప్పలుగా వస్తున్న దరఖాస్తులతో అధికారులు సైతం ఆశ్చర్యపోతున్నారు. మంగళవారం దరఖాస్తు చేసుకునేందుకు జనం క్యూ కట్టారు. ఇప్పటికే 300 వరకు దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలం హరిదాస్‌నగర్ గ్రామంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు పంపిణీ చేశారు.

పరామర్శ

రుద్రంగి: మండల కేంద్రానికి చెందిన అనారోగ్యంతో మృతిచెందిన ఎలేశ్వరం లక్ష్మి, ఆవు దాడిలో మృతి చెందిన దాసరి అంజవ్వ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య పరామర్శించారు. ఎంపీపీ గంగం స్వరూపారాణి, కోఆప్షన్ మెంబర్ జెమీలా బేగం, నాయకులు పాల్గొన్నారు.